క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఎంపీపీ కమ్లీమోత్యానాయక్



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ, నాయకులు

కడ్తాల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. జాతీయ స్వచ్ఛతా పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని మైసిగండిలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. మహిళా సమాఖ్య సభ్యులతో కలిసి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిపించారు. నాయకులు హీరాసింగ్, రాములు, సక్రి, గ్రామ కార్యదర్శి సత్యం తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న అనురాధ

ఆమనగల్లు: ఆమనగల్లులోని గిరిజన బాలికల వసతి గృహంలోని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ చెప్పారు. పట్టణంలోని గిరిజన బాలికల వసతి గృహాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా వారికి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రభుత్వం నాణ్యమైన విద్య, భోజనం అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. వసతిగృహం ఇన్‌చార్జి రామచంద్రయ్య, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్, రమేశ్, భాస్కర్, యాదయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటితో నిమజ్జనాలు ముగించాలి: సీఐ



మండప నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ కాశీ విశ్వనాథ్

మంచాల: గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకులను శనివారం (చివరి రోజు) సాయంత్రంలోపు నిమజ్జనం చేయాలని మంచాల సీఐ కాశీ విశ్వనాథ్ సూచించారు. శుక్రవారం మంచాల పీఎస్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. గ్రామాల్లో పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నా రు. ఘర్షణలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మిగిలిన వినాయకులను శనివారం తప్పక నిమజ్జనం చేయాలన్నారు. పోలీసులకు పూర్తి సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవినాయక్, ఏఎస్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభకు తరలిరండి

బీజేపీ కిసాన్‌మోర్చా



సమావేశంలో బీజేపీ నేతలు

ఆమనగల్లు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అక్టోబర్ 1న నిర్వహించే ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు మధుసూదన్‌రెడ్డి కోరారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మోదీ సభకు నాయకులు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, బీజేపీ నాయకులు వంశీధర్, నర్సింహారెడ్డి, నర్సింహ, శ్రీకాంత్‌సింగ్, విజయ్‌కృష్ణ, శ్రీనివాస్, రాఘవేందర్ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

మంచాల: మంచాల మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11:00 గంటలకు సమావేశం ప్రారంభమౌతుందని.. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని తెలిపారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు



ఆదిత్యానగర్‌లో ఇళ్లమధ్య మురుగు

తుర్కయంజాల్‌లో లోపించిన పారిశుద్ధ్యం

- ఇళ్లమధ్య పారుతున్న మురుగు
- దోమల వ్యాప్తితో రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

సాక్షి విజిట్

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం లోపించడంతో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. 10 రోజులకు పైగా మున్సిపల్ సిబ్బందిలో అధిక శాతం వినాయకుడి నిమజ్జన పనుల్లో ఉండటంతో ఫాగింగ్, మురికి కాలువల్లో ఆయిల్ బాల్స్ వదలడం, బ్లీచింగ్ వంటి ప్రక్రియను పూర్తిగా నిలిపివేశారు. ఫలితంగా దోమల బెడత మరింత పెరిగింది. ఏ ఇంట్లో చూసినా జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లునొప్పులు వంటి సమస్యలతో బాధపడుతున్న వారే కనిపిస్తున్నారు. వైద్యశాఖ అధికారుల లెక్కల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలో వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న వారు ప్రస్తుతం 50శాతానికి మించి ఉన్నారు. అయితే అధికశాతం మంది ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తుండటంతో జ్వరాలబారిన పడేవారి సంఖ్య పక్కాగా తెలియడం లేదు. మలేరియా, డెంగీ కేసుల కంటే జ్వరాల కేసులు మాత్రం బాగా పెరిగాయి.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ..

మున్సిపాలిటీ పరిధిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఇళ్ల మధ్యలో నుంచే మురుగు ప్రవహిస్తోంది. దీంతో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంది. ఈ సమస్య పరిష్కారానికై పలు పనులకు అంచనాలను రూపొందించినప్పటికీ అవి కార్యరూపం దాల్చడం లేదు. తుర్కయంజాల్, రాగన్నగూడలోని ద్వారకానగర్, శోభానగర్, సినర్జీ హోమ్స్, సాయి టౌన్‌షిప్, ఎస్ఎస్ఆర్. నగర్, సాయి హోమ్స్, ఎవెన్స్ కార్నర్ కాలనీల నుంచి వెలువడుతున్న మురుగంతా లక్ష్మీ మెగా టౌన్‌షిప్ వెనకువైపు నిలిచి ఉంది. అదే విధంగా ఆదిత్యానగర్‌లో బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల నుంచి వెలువడే మురుగు నీరు ఇళ్ల మధ్యలో నుంచే ప్రవహిస్తుండటం, ఓపెన్ ప్లాట్లలో నిలిచి ఉండటంతో దోమల వృద్ధి పెరిగింది. 21వ వార్డు పరిధిలోని లక్ష్మీ గార్డెన్, ఏవీసీ, శ్రీ సాయి హోమ్స్ కాలనీలు మాసబ్ చెరువుకు ఆనుకుని ఉండటంతో దోమల తాకిడి అధికంగా ఉంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వార్డుల్లో ఫాగింగ్ చేస్తాం



నీరు నిల్వ ఉండేచోట దోమలు పెరిగే అవకాశం ఉంటుంది. అలాంటి ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వదలే ప్రక్రియనే ఇప్పటికే ప్రారంభించాం. వార్డుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ వంటివి చేపడతాం. ప్రజలు కూడా సహకరించి ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

– శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, తుర్కయంజాల్

వైద్య పరీక్షలు చేయించుకోవాలి



సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్‌ల నియంత్రణకు వైద్యారోగ్యశాఖ సిబ్బంది నిత్యం పనిచేస్తున్నారు. మున్సిపాలిటీల పరిధిలో బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలు అందుబాటులో ఉన్నాయి. జ్వరంతో బాధపడుతున్న వారు వీటిని సందర్శిస్తే ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు మందులు పంపిణీ చేస్తాం.

– డాక్టర్ ధరణి కుమార్, డిప్యూటీ డీఎంహెచ్ఓ

ఉద్యోగ భద్రత కల్పించండి

5వ రోజుకు చేరిన ఆశ కార్యకర్తల సమ్మె



ఆమనగల్లు: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

ఆమనగల్లు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంతో 5వ రోజుకు చేరుకుంది. ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఆశ కార్యకర్తలకు నెలకు రూ.18వేల వేతనం ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ లలితకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు అలివేలు, నిర్మల, సల్మాబీబీ, అనిత, మంజుల, విజయ, స్వరూప, సక్కుబాయి, గౌరి, సంతోష, వరలక్ష్మి, లలిత తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలి..

మంచాల: మంచాలలో ఆశ వర్కర్లు చేస్తున్న దీక్ష శుక్రవారం కొనసాగింది. తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆశవర్కర్లు అమృత, అలివేలు, నవనీత, మంజుల, సంతోష, పద్మ, సుజాత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమ న్యాయం



మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో శుక్రవారం పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని మల్‌రెడ్డి స్పష్టం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమన్నారు. బీఆర్ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్ హామీలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో బీఆర్ఎస్ పార్టీకి దిమ్మతిరిగే సమాధానం ఇవ్వాలన్నారు. బహిరంగ సభల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. హయత్‌నగర్ ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్ రాజశేఖర్‌రావు, నగేశ్, భానుచందర్ కాంగ్రెస్ పార్టీలో చేరినవారిలో ఉన్నారు.

రేపు ఆదిబట్లలో 'స్వచ్ఛతా హీ సేవ'

మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: స్వచ్ఛతా లీగ్ 2.0లో భాగంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కమిషనర్ మాట్లాడుతూ.. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డుకి రెండు కార్యక్రమాల చొప్పున ప్రజాప్రతినిధులు, నాయకుల భాగస్వామ్యంతో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. రోడ్లు ఊడ్చడం, చెత్తను ఎత్తడం, డ్రైనేజీలు శుభ్రం చేయడం, స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించటం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అక్టోబర్ 1న (ఆదివారం) ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు గంట పాటు ఆయా కార్యక్రమాలు నిర్వహించాలని కోరా రు. ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్య లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మెరుగైన సేవలందించాలి

వనస్థలిపురం: బ్యాంకులు ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని, పెరుగుతున్న కాలనీలు, జనాభా దృష్ట్యా బ్రాంచిల సంఖ్యను పెంచాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హస్తినాపురం ఈస్ట్‌లో సాగర్ రహదారిపై నూతనంగా ఏర్పాటుచేసిన ఫెడరల్ బ్యాంక్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, జోనల్ హెడ్ దిలీప్ మాట్లాడుతూ.. తమ ఫెడరల్ బ్యాంక్ 29వ బ్రాంచిని హస్తినాపురంలో ఏర్పాటు చేశామన్నారు.ఆధునిక సౌకర్యాలతో ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించనున్నట్లు తెలిపారు. కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ చైర్మన్ రఘుమారెడ్డి, బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాలినీ వారియర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న గణపయ్య పూజలు



కడ్తాల్: వినాయక పూజలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు



యాచారం: పూజలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కడ్తాల్: మండల కేంద్రంలో వినాయక ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మండపాల వద్ద శుక్రవారం పూజలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ గ్రామంలో సిద్ధి వినాయక ఉత్సవ కమిటీ లడ్డూను వినోద్ రూ.1,12,116కు కైవసం చేసుకున్నారు.

చైతన్య యూత్ ఆధ్వర్యంలో..

యాచారం: మండల పరిధిలోని మొండిగౌరెల్లిలో చైతన్య యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు తాండ్ర లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా, ఎంపీపీ సుకన్య, బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్, యూత్ సభ్యులు శేఖర్, చిన్న, నర్సింహ, శ్రీను, మహేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో..

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొల్పిన గణనాథుల వద్ద లడ్డూల వేలం కొనసాగుతోంది. శుక్రవారం సాయినాధ్ కాలనీలోని గణనాథుడి లడ్డును రూ.72,116కు శ్రీనివాసచారి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేందర్‌నాయక్, ఉపాధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, కోశాధికారి సాంబయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

రూ.లక్షా57వేలు పలికిన లడ్డూ

మంచాల: మంచాల మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూ రూ.1,57,116 ధర పలికింది. శుక్రవారం నిర్వహించిన వేలంపాటలో దాచిరెడ్డి మహేందర్‌రెడ్డి అందరికంటే ఎక్కువకు పాడి లడ్డూను కై వసం చేసుకున్నారు. అనంతరం వినాయకుడి ఊరేగింపు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. మంచాల సర్పంచ్ అనిరెడ్డి జగన్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

లిబర్టీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని లిబర్టీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక లడ్డూను శుక్రవారంనిర్వహించిన వేలంపాటలో రూ.51 వేలకు రాజేష్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అతడిని సన్మానించి లడ్డూ అందజేశారు. అనంతరం వినాయకుడిని నిమజ్జనానికి తరలిరచారు.

'సహకార' సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: సహకార సంఘాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ ఎంపీపటేల్‌గూడలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సర్వసభ్య సమావేశం సంఘం అధ్యక్షుడు మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మంచిరెడ్డి మాట్లాడుతూ.. సహకార సంఘాల ద్వారా రైతులకు పెద్దఎత్తున దీర్ఘకాలిక రుణాలు అందించడం జరుగుతుందన్నారు. రుణాలు సకాలంలో చెల్లించి సంఘం బలోపేతానికి రైతులు కృషి చేయాలని సూచించారు. పీఏసీఎస్ భవనం లేక రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో 600 గజాల ప్రభుత్వ భూమిని కేటాయించడంతో పాటు భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చేతులమీదుగా 37 మంది రైతులకు రుణమాఫీ చెక్కులను అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, తులేకలాన్ సర్పంచ్ యాదగిరి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు బాల్‌రెడ్డి, యాదమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, బీరప్ప పాల్గొన్నారు.

గునగల్ అభివృద్ధికి నిధుల మంజూరు

యాచారం: గునుగల్ గ్రామాభివృద్ధికి రూ.27 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి, గునుగల్ సర్పంచ్ కాశమల్ల ఇందిర, ఉప సర్పంచ్ బీంయాదవ్ ఎమ్మెల్యేను కలిశారు. వారి విజ్ఞప్తి మేరకు గునుగల్ గేట్ నుంచి గ్రామం వరకు సీసీ రోడ్డుకిరువైపులా ఓపెన్ డ్రైనేజీ కాల్వల నిర్మాణం కోసం రూ.20 లక్షలు, గ్రామంలో కూరగాయల మార్కెట్ కోసం రూ.5 లక్షలు, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.2 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. నిధుల మంజూరు పత్రాలను గ్రామ ప్రజాప్రతినిధులకు అందజేశారు. అదే విధంగా గడ్డమల్లయ్యగూడలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్డు నిర్మాణ పనుల కోసం రూ.9లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు నర్సింహ, అచ్చన రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల అభిప్రాయం తీసుకోవాలి

కాంగ్రెస్ సీనియర్ నేత రాములు



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

ఆమనగల్లు: మెజార్టీ కార్యకర్తల అభిప్రాయం మేరకే కల్వకుర్తి అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ నేత మండ్లి రాములు అన్నారు. ఎన్నికల ముందు ఇతరపార్టీల నుంచి వచ్చే నాయకులకు టికెట్ ఇస్తే సహించేది లేదన్నారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని.. అతనికే కల్వకుర్తి ఎమ్మెల్యే టికెట్ ఖరారైందని వార్తలు వస్తున్నాయని తెలిపారు. ఇందులో నిజానిజాలను కాంగ్రెస్ అగ్రనాయకులు కార్యకర్తలకు వివరించాలని కోరారు. పార్టీలోకి రాగానే టికెట్ ఎలా ఇస్తారని, కార్యకర్తల అభిప్రాయం తీసుకుని టికెట్ కేటాయిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్‌పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డికి కల్వకుర్తి కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని ఆయన కోరారు. లేదంటే కాంగ్రెస్‌లోని సీనియర్ నాయకులకు టికెట్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రీరాములు, రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్, జైపాల్‌నాయక్, గోవింద్, రామస్వామి, లాలునాయక్, రాములు, రాజు, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ



కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు

కడ్తాల్: మైనార్టీల సంక్షేమానికి తెలంగాణ సర్కార్ పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కుట్టుమెషీన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముస్లింలకు షాదీముబారక్ పథకం, రంజాన్‌కు దుస్తుల పంపిణీ, మసీద్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్, బీజేపీలు.. మైనార్టీల సంక్షేమానికి చేసిందేమీ లేదని విమర్శించారు. మరోసారి బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్మన్ సత్యం, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీలు దశరథ్‌నాయక్, ఉప్పల వెంకటేశ్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంతరెడ్డి, రైతుబంధు మండలాల అధ్యక్షులు వీరయ్య తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు



శ్రమదానం చేస్తున్న కౌన్సిలర్ మంగ తదితరులు

21వ వార్డు కౌన్సిలర్ మంగ

ఇబ్రహీంపట్నం: బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పడేయొద్దని కౌన్సిలర్ మంగ ప్రజలను కోరారు. స్వచ్ఛత లీగ్–2లో భాగంగా ఇబ్రహీంపట్నంలోని 21వార్డులో శుక్రవారం నిర్వహించిన శ్రమదానంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. ఇంటి ముందుకు వచ్చే మున్సిపాలిటీ ట్రాక్టర్‌లోనే చెత్తను వేయాలన్నారు. ఇష్టానుసారంగా చెత్తను పడేయడం వలన దోమలు, ఈగలు వ్యాప్తి చెందడమే గాక పర్యావరణం కాలుష్యం అవుతుందన్నారు. పర్యావరణ పరిశుభ్రత పాటించాలన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జగదీశ్‌యాదవ్, మాల్లారెడ్డి, పాపిరెడ్డి, మహేశ్, వార్డు ఆఫీసర్ మనీష్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కొనసాగుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె



ఆమనగల్లు: నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆమనగల్లు: జీఓ నంబర్ 8 ప్రకారం పెంచిన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆమనగల్లు పట్టణంలో మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం కొనసాగింది. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. యూనియన్ సభ్యులు సత్యమ్మ, పద్మమ్మ, అలివేలు, గోజీ, బీమమ్మ, నబియాబేగం, బేబి, ఖాజాబీ, కాశమ్మ, రజియాబేగం, శాంతమ్మ, పెంటమ్మ, గిరిజ, కవిత, పార్వతమ్మ తదితరులు ఉన్నారు.

పెంచిన వేతనాలు ఇవ్వాలి..

మంచాల: మంచాల మండల కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం(రెండో రోజు) సమ్మె కొనసాగించారు. కార్మికులకు పెంచిన వేతనం ఇవ్వాలన్నారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్మికులు.. సరిత, సంతోష, అలివేలు, లక్ష్మి, పద్మమ్మ, యాదమ్మ, జంగమ్మ,రాణి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల భిక్షాటన



మంచాల: భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

మంచాల: సమ్మెలో భాగంగా శుక్రవారం అంగన్‌వాడీ వర్కర్లు మంచాల మండల కార్యాలయం వద్ద వినూత్న నిరసన తెలిపారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని భిక్షాటన చేశారు. 19 రోజులుగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వం దిగివచ్చేవరకు పోరాటం చేస్తామన్నారు. సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ, అంగన్‌వాడీ వర్కర్లు పద్మ, సుమతమ్మ, విజయ, జయమ్మ, లక్ష్మి, వరలక్ష్మి, జ్యోతి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ మండలంలో..

కడ్తాల్: సమస్యల పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు శుక్రవారం భిక్షాటన చేశారు. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.